సాక్షి నిజామాబాద్

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



భక్తుల కొంగు బంగారం..

స్వయంభు శ్రీలక్ష్మి అనంత పద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. తగిన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- 8లో ▸



మార్గదర్శకాలు పాటించాలి

ఈసీ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో నదుపాయాలు కల్పించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.6 /12.4

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

డీపీవోగా ముత్యాల శ్రీనివాస్

సుభాష్‌నగర్: జిల్లా పంచాయతీ అధికారిగా ముత్యాల శ్రీనివాస్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ డీఎల్‌పీవోగా పనిచేస్తున్న శ్రీనివాస్ గతేడాది సెప్టెంబర్ నుంచి ఇన్‌చార్జి డీపీవోగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజును బోధన్ డీఎల్‌పీవోగా బదిలీ చేసినట్లు తెలిసింది. కాగా, నిజామాబాద్ డీఎల్‌పీవోగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

ఏడుగురు టీచర్లకు షోకాజ్ నోటీసులు

నిజామాబాద్‌అర్బన్: ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన ఏడుగురు టీచర్లకు డీఈవో అశోక్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారిలో సాయిలు (ఎస్‌ఏ, తొర్లికొండ), ఏ గంగాధర్ (ఎస్‌ఏ, బ్రాహ్మణపల్లి), విజయేందర్ రెడ్డి (ఎస్‌ఏ, మునిపల్లి), కే వినోద్ (ఎస్‌ఏ, మోర్తాడ్ బాలికల పాఠశాల), రాంచందర్(ఎస్‌ఏ సంగెం), బాలాజీరావు (ఇన్‌చార్జి హెచ్‌ఎం, మో ప్రా), మనోజ్ (అంబం, ప్రాథమిక పాఠశాల) ఉన్నారు.

డుమ్మా టీచర్ల వేతనంలో కోత

నిజామాబాద్ అర్బన్: విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయుల వేతనంలో కోత విధిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ ఉన్నత పాఠశాలతోపాటు ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి ఉన్నత పాఠశాలను డీఈవో తనిఖీ చేశారు. అదే సమయంలో పలువురు టీచర్లు అనధికారికంగా గైర్హాజరయ్యారు. దీంతో తీవ్రంగా పరిగణించిన డీఈవో అశోక్.. వినాయక్‌నగర్ పాఠశాలలో నలుగురు టీచర్లు, తిర్మన్‌పల్లి పాఠశాలలో హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయుడికి సంబంధించిన ఒకరోజు వేతనంలో కోత విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

హమ్మయ్య.. మొర విన్నారు..

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సాక్షిలో ఈ నెల 14న ప్రచురితమైన 'చిరుద్యోగి మొర వినరూ'.. కథనానికి సంబంధిత శాఖల అధికారులు స్పందించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో వాచ్‌మెన్, స్వీపర్లు, కుక్‌లు అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఎనిమిది నెలలుగా జీతాలు అందకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. 2024 సంవత్సరంలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ జీతాలు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. సాక్షిలో కథనం రావడంతో చిరుద్యోగుల మొర విన్నారు. ముందుగా ఎస్సీ సంక్షేమశాఖ నుంచి ఎస్సీ వసతిగృహాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు శుక్రవారం ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. నేడో, రేపో ఎస్టీ, బీసీ వసతిగృహాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా జీతాలు బ్యాంకు ఖాతాల్లో పడనున్నాయి. జీతాలు రావడంతో సాక్షికి సంక్షేమ హాస్టల్‌లో పని చేస్తున్న ఉద్యోగులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు రివార్డు



ఖలీల్‌వాడి: ఈనెల 11న ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న గంజాయిని కామారెడ్డి జిల్లా బాన్సువాడ వద్ద పట్టుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి ఎక్సైజ్ రాష్ట్ర డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి క్యాష్ రివార్డు అందించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎక్సైజ్ కార్యాలయ ఛాంబర్‌లో శుక్రవారం ఆయన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్నతోపాటు సిబ్బందికి రూ.30వేల క్యాష్ రివార్డు, ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు.

ప్రాణాలతో ఆటలా!

- ఎస్సారెస్పీ తీరంలో ఫొటోషూట్‌లు
- ప్రమాదకర ప్రాంతాల్లో యువత విన్యాసాలు



సాగరతీరంలో యువతీయువకులు



ప్రాజెక్టు లోపల నీటి అంచున ఫొటోషూట్ చేస్తున్న యువకులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ జలాశయంలో ఫొటోషూట్‌లు మళ్లీ మొదలయ్యాయి. ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో ప్రీవెడ్డింగ్, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోషూట్‌ల కోసం పర్యాటకులు తరలివస్తున్నారు. ప్రమాదకరమైనా జలాశయం లోపలికి వెళ్లి వీడియో, ఫొటోలు తీసుకుంటున్నారు. గతేడాది లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ సమీపంలో ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృత్యువాత పడిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు, ప్రాజెక్టు అధికారులు ఎస్సారెస్పీ తీర ప్రాంతాల్లోకి పర్యాటకులను అనుమతించలేదు. కాగా, కొన్ని రోజులుగా ప్రాజెక్టు సందర్శన పేరిట వస్తున్న యువతీయువకులు సాగరతీరంలో ప్రమాదపుటంచున ఫొటోషూట్‌లు చేస్తున్నారు. గతంలో మాదిరిగా దుర్ఘటన జరగకముందే అధికారులు, పోలీసులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కరెంటు బాయిలర్లు ఎప్పుడో!

- ఎదురుచూస్తున్న రైతులు
- పాత పద్ధతుల్లోనే పసుపు కొమ్ముల బాయిలింగ్
- కట్టెల కొనుగోలుకు తప్పని ఆర్థిక భారం
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు



ఆర్మూర్ ప్రాంతంలో కట్టెలతో పసుపు ఉడకబెడుతున్న కూలీలు



ఆర్మూర్: నానాటికీ పెరుగుతున్న యాంత్రీకరణ సేద్యానికి ఊపిరిపోస్తోంది. కొత్త కొత్త యంత్రాలు సాగులో పని భారాన్ని తగ్గిస్తూ రైతులకు పెట్టుబడి మిగిలిస్తున్నాయి. ఇతర పంటలు సాగుచేసే రైతులకు బాగానే ఉన్నా.. పసుపు రైతులు మాత్రం ఓ అధునాతన యంత్రం కోసం ఎదురు చూస్తున్నారు. అదే పసుపు కొమ్ములు ఉడికించే ఎలక్ట్రిక్ బాయిలర్.

జిల్లాలో సుమారు 35 వేల ఎకరాల్లో రైతులు పసుపును పండిస్తున్నారు. పసుపు కొమ్మును ఉడకబెట్టేందుకు సరైన యంత్రాలు లేక.. రైతులు ఇంకా పాతపద్ధతిలోనే మరగబెడుతున్నారు. మొదట్లో పసుపు కొమ్మును ఉడికించేందుకు రైతులు కడాయిలను ఉపయోగించేవారు. తర్వాతి కాలంలో ఒకేసారి సులభంగా నాలుగు ట్యాంకుల్లో పసుపు ఉడకబెట్టేలా బాయిలర్లను రూపొందించారు. కడాయి, బాయిలర్‌లో పసుపును ఉడకబెట్టాలంటే కట్టెలతో మంట పెట్టాల్సిందే. ఏటా జిల్లా వ్యాప్తంగా 35 వేల ఎకరాల్లో పండిన పసుపును ఉడికించాలంటే సుమారు 70 వేల టన్నుల కట్టెలు అవసరం ఉంటుంది. దీంతో రైతుల పెట్టుబడి ఖర్చు పెరిగిపోతుంది. కట్టెలకు బదులుగా ఎలక్ట్రిక్ బాయిలర్‌ను అందుబాటులోకి తెస్తే సమయం ఆదాతోపాటు పెట్టుబడి ఖర్చు తగ్గే ఆస్కారం ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని నిపుణుల సహకారంతో పసుపు ఉడికించే ఎలక్ట్రిక్ బాయిలర్లను ఆవిష్కరించాలని పేర్కొంటున్నారు. ఐదేళ్ల క్రితం వ్యవసాయ శాఖ అధికారులు ఓ ఎలక్ట్రిక్ బాయిలర్‌ను పరీక్షించగా, సరైన ఫలితం లేకపోవడంతో ఆ ప్రయత్నాలను నిలిపివేసినట్లు రైతులు చెబుతున్నారు.



పసుపు ఉడకబెట్టడానికి రైతులు ముందుగా సమకూర్చుకున్న కట్టెలు

ఎలక్ట్రిక్ బాయిలర్లు రూపొందించాలి..



పసుపు కొమ్మును ఉడకబెట్టడం కోసం నిపుణులు ఎలక్ట్రిక్ బాయిలర్లను రూపొందించాల్సిన అవసరం ఉంది. ఆ బాయిలర్లను సబ్సిడీపై రైతులకు అందుబాటులోకి తీసుకువస్తే కట్టెల వాడకమే తగ్గిపోతుంది. – నలిమెల చిన్నారెడ్డి, రైతు, మగ్గిడి, ఆర్మూర్ మండలం

ప్రాధాన్యతను గుర్తించాలి



పసుపు పండించడానికి అవసరమైన యంత్రాలను రైతులకు అందుబాటులోకి తేవాలి. నిపుణులు ఎలక్ట్రిక్ బాయిలర్ల తయారీకి సంకల్పించాలి. కానీ, ఆ దిశగా ప్రయత్నాలు జరగకపోవడం విచారకరం. – పెద్దకాపు రాజు, రైతు, పెర్కిట్, ఆర్మూర్ పట్టణం

కోళ్ల సరఫరా బంద్!

- వైరస్ తీవ్రత తగ్గే వరకు చికెన్ సెంటర్లకు సప్లయ్ చేయొద్దు
- పౌల్ట్రీ యజమానులకు ఆదేశాలు జారీ చేసిన అధికారులు



జిల్లాలోని ఓ పౌల్ట్రీలో భారీగా మృతి చెందిన కోళ్లు (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): చికెన్ సెంటర్లకు కోళ్ల సరఫరా చేయడంపై అధికారులు ఆంక్షలు విధించారు. వైరస్ తీవ్రత తగ్గే వరకు కోళ్లను సరఫరా చేయొద్దని పౌల్ట్రీ రైతులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 13 పౌల్ట్రీ ఫారాల్లో వైరస్ వ్యాపించగా భీమ్‌గల్, వేల్పూర్, నవీపేట్, పోతంగల్, కమ్మర్‌పల్లి, బోధన్ ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో కోళ్లు మరణించిన విషయం విదితమే. దీంతో మిగతా మండలాల్లోని పశువైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఎప్పటికప్పుడు కోళ్ల ఫారాలను తనిఖీ చేస్తూ పశుసంవర్ధక శాఖకు నివేదిక పంపిస్తున్నారు. పౌల్ట్రీల్లో తరచూ జీవ సంరక్షణ చర్యలు చేపట్టాలని, వైరస్ అదుపులోకి వచ్చిన తర్వాత కోళ్లను చికెన్ సెంటర్లకు సరఫరా చేసుకోవాలని సూచిస్తున్నారు. తొందరపడి సరఫరా చేస్తే వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికే కోళ్ల రవాణాను నిరోధించేందుకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతాలైన సాలూర, కందకుర్తి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపడుతున్నారు. పలు వాహనాలను సైతం వెనక్కి పంపించినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి తెలిపారు. ఇదిలా ఉండగా వైరస్ దాదాపు అదుపులోకి వచ్చిందని, అయితే అది ఏ వైరస్ అనేది హైదరాబాద్ ల్యాబ్ అధికారులు నిర్ధారించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

సమసమాజ స్థాపనకు బడ్జెట్ కేటాయింపులు ఉండాలి



మాట్లాడుతున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): సమ సమాజాన్ని స్థాపించడం కోసం బడ్జెట్‌లో తగిన కేటాయింపులు ఉండాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. తెయూ అప్లయిడ్ ఎకనామిక్స్ విభాగాధిపతి పున్నయ్య అధ్యక్షతన 'భారత ఆర్థిక వ్యవస్థపై కేంద్ర బడ్జెట్ ప్రభావం' అనే అంశంపై శుక్రవారం చర్చ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ప్రసంగించారు. భారత ఆర్థిక వ్యవస్థ అనేక అడ్డంకులను అధిరోహించుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు పోతుందన్నారు. ప్రభుత్వాలు ఒకవైపు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత నిస్తూనే, పారిశ్రామిక, సేవ రంగాలను వేగంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నాయన్నారు. రెవెన్యూ రాబడి కంటే రెవెన్యూ వ్యయం అధికంగా ఉన్నదని దీనిని తగ్గించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పన్నుల వ్యవస్థలో సంపూర్ణమైన సంస్కరణలు తీసుకురావాలన్నారు. ఆయా విభాగాధిపతులు సీహెచ్‌ఆరతి, రాంబాబు గోపిశెట్టి, హెచ్‌ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు స్వప్న, సంపత్, రామలింగం, నర్సయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వైభవంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఆలయాల సహాయ కమిషనర్ శ్రీరాం రవీందర్

- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలి
- ఉమ్మడి జిల్లా ఆలయాల సహాయ కమిషనర్ శ్రీరాం రవీందర్

నిజామాబాద్ రూరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ఆలయాల సహాయ కమిషనర్ శ్రీరాం రవీందర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని దేవాదాయ, ధర్మాదాయశాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఆలయాల కార్యనిర్వహణ అధికారులు, జూనియర్ అసిస్టెంట్లతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న మహా శివరాత్రిని పురస్కరించుకొని శివాలయాల్లో భక్తుల రద్దీ ఉంటుందని, బందోబస్తు కోసం సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఉపవాస దీక్ష చేపట్టే భక్తుల కోసం ఏర్పాట్లు చేయాలని, ఆలయాల్లో భజనలు, హరికథ పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

'కల్యాణలక్ష్మి' వెనుదిరిగింది..

- పంపిణీలో జాప్యం.. చెక్కులు వాపస్
- మూడు నెలల కిందటే మంజూరైన నిధులు
- సకాలంలో పంపిణీ చేయని వైనం
- చెల్లుబాటు కాని చెక్కులు
- తేదీ మార్పు కోసం ట్రెజరీకి పంపిన అధికారులు



మోర్తాడ్(బాల్కొండ): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులకు కాలం చెల్లింది. నిర్ణీత సమయంలో లబ్ధిదారులకు అందజేయకపోవడంతో చెల్లుబాటుకు బ్రేక్ పడింది. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల పంతం.. లబ్ధిదారులకు శాపమైంది. దీంతో చెక్కుల్లో తేదీల మార్పు కోసం అధికారులు తిరిగి ట్రెజరీకి పంపించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు నిరీక్షణ తప్పటం లేదు. బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్, వేల్పూర్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి మండలాల్లోని 179 మంది లబ్ధిదారులకు 2024 నవంబర్ మొదటి వారంలో చెక్కులు అందించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం చెక్కు జారీ చేసిన తేదీ నుంచి చెల్లుబాటు కావడానికి 90 రోజులే అవకాశం ఉంటుంది. గడువు ముగిస్తే ఆ చెక్కులను డ్రా చేసేందుకు వీలుండదు. మోర్తాడ్, వేల్పూర్ మండలాల లబ్ధిదారులకు 2024 నవంబర్ 2న, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి లబ్ధిదారులకు నవంబర్ 5న చెక్కులు సిద్ధమయ్యాయి. తహసీల్ కార్యాలయాలకు నవంబర్‌లో చెక్కులు చేరగా వాటి పంపిణీలో తీవ్ర జాప్యం ఏర్పడింది. చెక్కులు చెల్లుబాటు అయ్యే పరిస్థితి లేకపోవడంతో వాటిని ట్రెజరీ శాఖకు అధికారులు వాపసు చేశారు. చెక్కుల తేదీల్లో మార్పులు చేసేందుకు రెవెన్యూ అధికారులు ఇటీవల ట్రెజరీకి లేఖ రాశారు. చెక్కుల తేదీల్లో మార్పు చేసేందుకు ఎంతో పెద్ద ప్రక్రియ ఉంటుందని బ్యాంకర్లు చెబుతున్నారు. చెక్కుల చెల్లుబాటు గడువు ముందే గుర్తించి పంపిణీ చేసి ఉంటే ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదని వివరించారు.

నాయకుల పంతం.. సామాన్యులకు శాపం

బాల్కొండ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో వింత పరిస్థితి నెలకొంది. అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకుల మధ్య ఉన్న వివాదంతో చెక్కుల పంపిణీ నిర్వహణ అధికారులకు ఇబ్బందిగా మారింది. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే చేతులు మీదుగా చెక్కులను పంపిణీ చేయాల్సి ఉంది. ఇదే కార్యక్రమంలో అధికార పార్టీ నేతలు పాల్గొంటుండటంతో ప్రతిపక్ష పార్టీకి మింగుడుపడటం లేదు. చెక్కుల పంపిణీకి తాను దూరంగా ఉంటున్నట్లు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రకటించారు. గడువు తేదీ ముగిసిపోయే సమయంలో ప్రశాంత్‌రెడ్డి తన నిర్ణయం వెల్లడించడం, సర్వే తదితర పనుల ఒత్తిడితో చెక్కుల పంపిణీ సకాలంలో జరగలేదు. ఫలితంగా చెల్లుబాటు కాని చెక్కులను అధికారులు వాపసు చేయాల్సి వచ్చింది. పెళ్లి సాయం చెక్కు చేతికి వస్తే అప్పులు తీర్చుకోవచ్చునని భావించిన వారు మరికొంత కాలం ఆగక తప్పని పరిస్థితి నెలకొంది.

తేదీ మార్పు కోసం పంపించాం

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల తేదీల్లో మార్పు కోసం పంపించాం. గడువులోగా చెక్కులు లబ్ధిదారులకు చేరి ఉంటే రీవ్యాలిడేషన్‌కు అవకాశం ఉండేది కాదు. మున్ముందు సకాలంలో చెక్కుల పంపిణీ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తాం.
– రాజుగౌడ్, ఆర్డీవో, ఆర్మూర్

- ఆరు నెలలపాటు ఎక్స్‌టెన్షన్
- ఉత్తర్వులందుకున్న ఛైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

డీసీసీబీ పదవీకాలం పొడిగింపు

సుభాష్‌నగర్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గం పదవీకాలాన్ని ఆరు నెలలపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత జీవో నం.74ను విడుదల చేసినట్లు డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును టెస్కాబ్ అధ్యక్షుడు రవీందర్‌రావు ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్లు కలిశారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ సంఘాల బలోపేతానికి మరింత కృషి చేస్తామని రమేశ్‌రెడ్డి చెప్పారు.

పీఏసీఎస్‌లు సైతం..

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలాన్ని సైతం ఆరు నెలలపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 16తో పాలకవర్గాల పదవీకాలం ముగియనుండగా ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సొసైటీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తారని మొదట ప్రచారం జరిగినప్పటికీ పదవీకాలం పొడిగింపునకే ప్రభుత్వం మొగ్గు చూపింది. దీంతో జిల్లాలో మొత్తం 89సొసైటీలకు మరో ఆరు నెలలపాటు పాత పాలకవర్గాలే కొనసాగనున్నాయి. కాగా, ఐడీసీఎంఎస్‌ల పదవీకాలం పొడిగింపుపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.



చైర్మన్లకు ఉత్తర్వు కాపీ అందజేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

ఆరోగ్యమే మహాభాగ్యంగా జీవించాలి

- డీఆర్‌డీవో సాయాగౌడ్



మాట్లాడుతున్న డీఆర్డీవో సాయాగౌడ్

నిజామాబాద్‌అర్బన్: మంచి ఆహారపు అలవాట్లు జీవన ప్రమాణాలను పెంచుతాయని, మహిళలందరూ ఆరోగ్యమే మహాభాగ్యంగా జీవించాలని డీఆర్డీవో సాయాగౌడ్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఏపీఎంఎస్, సీసీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీఆర్డీవో మాట్లాడారు. ఆదాయానికి తగినట్లుగా జీవనశైలిలో మార్పులు చేసుకోవాలన్నారు. ఆరోగ్యం, పిల్లల పోషణ, పరిసరాల శుభ్రత, పారిశుద్ధ్యం, రక్తహీనత, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళా సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, రీసోర్స్ పర్సన్లుగా డీపీఎం సాయిలు, శ్రీనివాస్, ఏపీఎంఎస్ సరోజినీ, గంగాధర్, రాజేందర్, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లాకు రెండు అవార్డులు



సుభాష్‌నగర్‌: టీజీఎస్‌పీడీసీఎల్‌ కంపెనీ ఐ ఎన్‌టీయూసీ–327 యూనియన్‌ 2024 సంవత్సరానికిగాను జిల్లాకు చెందిన జిల్లా అధ్యక్షుడు కనకమేడల వేణుగోపాల్‌రావు, కంపెనీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, జిల్లా రీజినల్‌ కార్యదర్శి పూదరి గంగాధర్‌కు బెస్ట్‌ లీడర్‌ అవార్డు, బెస్ట్‌ ఫైనాన్షియల్‌ సపోర్ట్‌ అవార్డులు వరించాయి. హైదరాబాద్‌లో శుక్రవారం ఐఎన్‌టీయూసీ ఆలిండియా అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్‌ సంజీవ్‌రెడ్డి, సెక్రెటరీ జనరల్‌ ఇనుగాల శ్రీధర్‌ అవార్డులు అందించారు. యూనియన్‌ నాయకులు, కంపెనీ ఉద్యోగులు అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు.

బాల్య వివాహం అడ్డగింత

బోధన్‌రూరల్‌: మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన ఓ యువకుడికి మహారాష్ట్రకు చెందిన బాలికతో బాల్య వివాహం చేసేందుకు యత్నించగా శుక్రవారం అధికారులు అడ్డుకున్నారు. 18 ఏళ్లు నిండకుండా బాలికకు వివాహం చేస్తున్నారన్న సమాచారం అధికారులకు అందింది. దీంతో వారు శుక్రవారం కల్దుర్కి గ్రామానికి చేరుకుని యువకుడి కుటుంబసభ్యులతో మాట్లాడి, వివాహాన్ని నిలిపివేశారు. అనంతరం సదరు బాలికను జిల్లా కేంద్రంలోని సీడబ్ల్యూసీ అధికారులకు అప్పగించారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక

ధర్పల్లి: ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జంతు, గణిత శాస్త్రంలో జిజ్ఞాసకు సమర్పించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రాజెక్టు అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, నిహారిక, జిజ్ఞాస ప్రాజెక్టు సమన్వయకర్త రవిరాజును ప్రిన్సిపాల్‌ అభినందించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో సైతం విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఆటో ఢీకొని ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లి చౌరస్తాలో ఆటో ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఆరో టౌన్‌ ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. అర్సపల్లి చౌరస్తాలో షేక్‌ కరీం(45) అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా అతడిని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంటల బీమా ఉందా? లేదా?

- మార్గదర్శకాలు విడుదల చేయని ప్రభుత్వం
- అయోమయంలో అన్నదాతలు



నందిపేట శివారులో సాగు అవుతున్న వరిపంట

నందిపేట్‌(ఆర్మూర్‌): అన్నదాతలు తాము పండించే పంటకు బీమా ఉందో, లేదోనని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో పంటలు దెబ్బతింటే అన్నదాతలకు అండగా ఉండేందుకు ఫసల్‌ బీమా యోజన పథకం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కానీ నేటికి మార్గదర్శకాలు మాత్రం విడుదల చేయలేదు. దీంతో తాము పండించిన పంటలకు బీమా ఉంటుందా, లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆరేళ్లు దూరంగా...

పంటలపై బీమా కోసం గతంలో కేంద్రం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, రైతులు 20 శాతం ప్రీమియం చెల్లించేవారు. తర్వాత రాష్ట్రంలోని గత ప్రభుత్వం ఈ పథకంలో నుంచి బయటకు వచ్చింది. దీంతో సుమారు ఆరు ఏళ్లుగా రాష్ట్రంలో ఫసల్‌ బీమా అమలుకు నోచుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వడగళ్లు, ఈదురు గాలులు, వరదలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పటికీ అందలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చాక బీమా ఆవశ్యకతను గుర్తించి పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం వంద శాతం ప్రీమియం చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలను విడుదల చేయలేదు. ఇప్పటికీ జిల్లాలో మొక్కజొన్న, సోయా, పసుపు పంటల సాగు పూర్తయింది. వరినాట్లు కూడ పూర్తయ్యాయి. దీంతో ఫసల్‌ బీమా యోజన పథకం అమలు అవుతుందా, లేదా అనే అని సంశయం రైతుల్లో నెలకొంది.

భరోసా కల్పించాలి..



రాష్ట్ర ప్రభుత్వం ఫసల్‌ బీమా అమలు చేస్తామనడం హర్షణీయం. కానీ ఇప్పటి వరకు అమలు చేయకపోవడం నిరాశకు గురిచేస్తుంది. పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి. ఈ పథకం మార్గదర్శకాలు విడుదల చేసి వెంటనే అమలు చేయాలి.

– సువ్వి, రైతు, బాద్గుణ గ్రామం, నందిపేట మండలం

ఆదేశాల మేరకు చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం పలు మార్లు నిర్వహించిన సమావేశాల్లో పంటల బీమా అంశం ప్రస్తావనకు వచ్చింది. కానీ ఇప్పటి వరకు ఫసల్‌ బీమా మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు తగిన చర్యలు చేపడుతాం.

– వాజిద్‌ హుస్సేన్‌, డీఏవో, నిజామాబాద్‌

భక్తుల కొంగుబంగారం.. అనంత పద్మనాభుడు

- మల్కాపూర్‌(ఏ)లో ఏకశిలపై స్వయంభువుగా వెలిసిన స్వామివారు
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అనంత పద్మనాభస్వామి మూలవిరాట్‌

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని మల్కాపూర్‌(ఏ) గ్రామంలో వెలిసిన స్వయంభువు శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి భక్తులు కోరిన కోరికలు తీరుస్తూ కొంగుబంగారంగా వెలుగొందుతున్నాడు. ఏకశిలపై వెలిసిన ఈ స్వామివారు దినదినాభివృద్ధి చెందుతున్నట్లు ప్రతీక. అనంత పద్మనాభున్ని పూజిస్తే సంతాన ప్రాప్తి, శని దోషాలు తొలగడం, పెళ్లి కాని వారికి పెళ్లి సంబంధాలు కుదరడం, కుటుంబంలో మనశ్శాంతి ఉంటుందని భక్తుల నమ్మకం.

ప్రతి శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించడంతోపాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తారు. ఈ ఆనవాయితీ గత పదేళ్లుగా కొనసాగుతూ వస్తోంది. ఈక్రమంలో శనివారం నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈనెల 20 వరకు ఉత్సవాలు వైభవంగా కొనసాగనున్నాయి. ఈ ఆలయానికి జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు బ్రహ్మోత్సవాలకు భారీగా వస్తారని నిర్వాహకులు పేర్కొంటున్నారు. స్వామివారి ఉత్సవాలను ఒక సంవత్సరం మల్కాపూర్‌(ఏ) గ్రామస్తులు, తదుపరి సంవత్సరం అనంతగిరి గ్రామస్తులతోపాటు ధర్మారం(ఏ) గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు సంయుక్తంగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణం, రథోత్సవం, చక్రతీర్థంతో వేడుకలు ముగుస్తాయి.

నిష్టతో పూజిస్తే ప్రతిఫలం..

మల్కాపూర్‌(ఏ) గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామిని నిష్టతో పూజిస్తే ప్రతిఫలం తప్పకుండా లభిస్తుంది. దీర్ఘకాలికంగా ఉన్న కోరికలు సైతం నెరవేరి, వారి కుటుంబాల్లో ఆనందం నెలకొంటుంది. భగవంతుని పట్ల విశ్వాసం, నమ్మకం నిలుపుకొని పూజిస్తే కోరుకున్న కోరికలు తీరుతాయి.

– మాకునూరు శ్రీనివాసులు, ఆలయ ప్రధాన అర్చకులు

ముగిసిన ఖిల్లా రామాలయ బ్రహ్మోత్సవాలు



నాగవెల్లి పూజ నిర్వహిస్తున్న పండితులు



ఉత్సవ విగ్రహాలతో నృత్యాలు చేస్తున్న పండితులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో గత వారం రోజులుగా జరుగుతున్న సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నాకబలి, పుష్పయాగం, ఉద్వాసన బలి కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన నాగవెల్లి కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌, ఆలయ కమిటీ చైర్మన్‌ జంగం శాంతయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్‌, డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్‌, సొసైటీ మాజీ చైర్మన్‌ గజవాడ జైపాల్‌, గ్రామ పెద్దలు బూస సుదర్శన్‌, యాదగిరి తదితరులు పాల్గొని, పూజలు నిర్వహించారు. రాత్రి ఏకాంతసేవ కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి.

‘ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలి’



రెంజల్‌ హైస్కూల్‌లో పోలింగ్‌బూత్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

రెంజల్‌(బోధన్‌): ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తు పోలింగ్‌ కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు సిబ్బందికి సూచించారు. రెంజల్‌ హైస్కూల్‌లోని పోలింగ్‌ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. త్వరలో జరుగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అందుబాటులో ఉన్న వసతులను తనిఖీ చేశారు. మిగిలిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మన ఊరు–మన బడి కింద పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను పరిశీలించారు. అలాగే రెంజల్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకి సూచించారు. పాఠశాలకు కొత్త బియ్యం సరఫరా చేయడంతో వండిన తర్వాత అన్నం మెత్తగా అవుతుందని ప్రిన్సిపాల్‌ అర్షియా నాజాం కలెక్టర్‌ దృష్టికి తీసుకవచ్చారు. వెంటనే స్పందించిన కలెక్టర్‌ గురుకులాలు, హాస్టల్‌లు, ప్రభుత్వ పాఠశాలలకు ఎంఎల్‌ఎస్‌ పాయింట్ల ద్వార పాత బియ్యం నిల్వలను అందించే ఏర్పాట్లు చేయాలని పౌర సరఫరాల జిల్లా అధికారికి ఆదేశించారు.

న్యాయమూర్తులపై దాడి సరికాదు



మాట్లాడుతున్న బార్‌ అధ్యక్షుడు జగన్మోహన్‌ గౌడ్‌

ఖలీల్‌వాడి: దోషులు న్యాయమూర్తులపై దాడి చేయడం సరికాదని నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌ మోహన్‌గౌడ్‌ అన్నారు. రాష్ట్ర ఫెడరేషన్‌ ఆఫ్‌ బార్‌ అసోసియేషన్‌ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాకోర్టులో అదనపు జిల్లా న్యాయమూర్తి హరిషాపై ఒక కేసులో నేర నిర్ధారణ అయిన దోషి దాడికి పాల్పడడం ఆందోళనకరమన్నారు. మహిళ జడ్జిపై దాడి న్యాయవ్యవస్థపై దాడిగా అభివర్ణించారు. న్యాయస్థానాలలో విచారణకు హాజరయ్యే ముద్దాయిలపై కోర్టు భద్రత సిబ్బంది తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. అనంతరం న్యాయమూర్తిపై దాడికి నిరసనగా బార్‌ ప్రతినిధులు, లాయర్లు విధులు బహిష్కరించారు. అలాగే నిజామాబాద్‌ జిల్లాకోర్టు ప్రాంగణం రెండో అంతస్తులోని ఒక కోర్టు గది వద్ద అపరిచిత వ్యక్తుల చర్యలు అపాయకరంగా ఉన్నాయని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని బార్‌ అధ్యక్షుడు జగన్మోహన్‌ గౌడ్‌ ఇన్‌చార్జి జిల్లాజడ్జి కనకదుర్గకు వినతిపత్రం అందజేశారు. బార్‌ సభ్యులు మంథని రాజేందర్‌ రెడ్డి, ఎర్రం గణపతి, తుల గంగాధర్‌, గంగ ప్రసాద్‌, ఆశ నారాయణ, మద్దెపల్లి శంకర్‌, పెండెమ్‌ రాజు, కార్యదర్శి సురేష్‌ దొన్పల్‌, దీపక్‌, మానిక్‌ రాజు, బాగిర్తి సాయిరెడ్డి, సదానంద్‌ గౌడ్‌,రత్నాకర్‌ రెడ్డి, విగ్నేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- ఎనిమిది మందికి గాయాలు



లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న బస్సు

కామారెడ్డి క్రైం: యూటర్న్‌ తీసుకుంటున్న ఆర్టీసీ బస్సును వెనకనుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో 8 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. టేక్రియాల్‌ జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్‌ బస్సు ప్రయాణికులతో ఉదయం 10.30 గంటల ప్రాతంలో కామారెడ్డికి వస్తోంది. టేక్రియాల్‌ బైపాస్‌ సమీపంలో బస్సు బ్రిడ్జి నుంచి సర్వీస్‌ రోడ్డువైపు రావడానికి యూటర్న్‌ తీసుకుంటుండగా వెనకనుంచి వేగంగా వచ్చిన రాజస్థాన్‌ రాష్ట్రానికి చెందిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో సహా 8 మందికి గాయాలయ్యాయి. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్సై రాజు తెలిపారు.

క్రైం కార్నర్‌

కోటగిరి జీపీ కార్యదర్శికి ఏడాది జైలు

ఖలీల్‌వాడి/రుద్రూర్‌: లంచం తీసుకున్న కేసులో కోటగిరి జీపీ కార్యదర్శి జీఎం సుదర్శన్‌కు శుక్రవారం నాంపల్లి ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్‌ అఫ్రోజ్‌ అక్తర్‌ ఏడాది కఠిన జైలు శిక్షతోపాటు రూ.40వేల జరిమానా విధించినట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్‌ తెలిపారు. వివరాలు ఇలా.. కోటగిరికి చెందిన వడ్డే నర్సింహులు తన తండ్రి లింగయ్య పేరు మీద ఉన్న ఇళ్లను అతడి సోదరుడి పేరు మీద బదిలీ చేయాలని గ్రామ కార్యదర్శి సుదర్శన్‌కు 2014లో విన్నవించాడు. కానీ అతడు రూ. 10వేలు లంచం డిమాండ్‌ చేయగా, నర్సింహులు రూ.8వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేని నర్సింహులు ఏసీబీ డీఎస్పీని ఆశ్రయించాడు. ఈక్రమంలో ఫిబ్రవరి 21, 2024న సెక్రటరీ సుదర్శన్‌కు రూ.8వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో ఏసీబీ తరపున స్పెషల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ మనోజ్ఞ వాదనలు వినిపించగా, ఇరువర్గాల వాదనలు విన్న నాంపల్లి ఏసీబీ కోర్టు జడ్జి ఏడాది కఠిన జైలు శిక్షతోపాటు రూ.40వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు తెలిపారు. జరిమానా చెల్లించని యెడల ఒకనెల అదనపు సాధారణ కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు వెల్లడించినారు.

డ్రంకన్‌డ్రైవ్‌ కేసులో ఒకరికి రెండురోజుల జైలు

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలుశిక్ష పడ్డట్లు ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ శుక్రవారం తెలిపారు. ఇటీవల డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీల్లో 13మంది పట్టుబడగా ట్రాఫిక్‌ ఎస్సై చంద్రమోహన్‌ వారికి కౌన్సెలింగ్‌ నిర్వహించారు. అనంతరం సెకండ్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపరచగా 12మందికి రూ.17వేలు జరిమానా విధించగా, ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన దాసరి మమత అనే గృహిణి అదృశ్యమైనట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్‌ తెలిపారు. శుక్రవారం ఉదయం ఇసాయిపేటలో ఆమె కామారెడ్డి వైపునకు వెళ్లే బస్సు ఎక్కి వెళ్లగా, ఇప్పటికీ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో భర్త మహిపాల్‌ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

‘అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు’

ఖలీల్‌వాడి: జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసినా, సహకరించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి పోలీస్‌ కమిషనర్‌ సిహెచ్‌ సింధుశర్మ ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో జనవరి, ఫిబ్రవరి నెలలో ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై 31కేసులు, నిజామాబాద్‌ డివిజన్‌లో 13కేసులు, ఆర్మూర్‌ డివిజన్‌లో 13కేసులు, బోధన్‌ డివిజన్‌లో 5కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసినట్లు తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్‌ స్టేషన్‌ లేదా పోలీస్‌ కంట్రోల్‌ రూమ్‌ 08462–226090, డయల్‌ 100కు ఫోన్‌ చేసి, సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఒకరిపై కత్తితో దాడి

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై మొగులయ్య తెలిపిన వివరాలు ఇలా.. ఉన్నాయి. నిర్మల్‌ జిల్లాకు చెందిన బాబు కూలీ పనులు చేస్తూ జీవిస్తుండేవాడు. ఈనెల 12న రాత్రి అతడు నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తున్న సమయంలో పక్కన మరో యువకుడు వచ్చి పడుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత అతడు బాబు జేబులో నుంచి డబ్బులు తీస్తుండగా, మెలుకువ వచ్చి, రైల్వే పోలీసులకు తెలిపాడు. వారు సదరు యువకుడిని అక్కడి నుంచి పంపించారు. కొంతసేపు తర్వాత మళ్లీ అతడు బాబు వద్దకు వచ్చి, కత్తితో దాడి చేశారు. వెంటనే స్థానికులు గాయపడిన బాబును జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స అనంతరం శుక్రవారం అతడు డిశ్చార్జ్‌ అయ్యాడు. ఈ కేసును ఒకటో టౌన్‌ పోలీసులు రైల్వే పోలీసులకు ట్రాన్స్‌ఫర్‌ చేయనున్నారు.

‘కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ ట్రాప్‌లో పడొద్దు’

నిజామాబాద్‌నాగారం: తెలంగాణలోని హిందువుల మధ్య సీఎం కుట్రలు పన్నుతున్నాడని, ఎవరూ కూడా కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ ట్రాప్‌లో పడొద్దని నిజామాబాద్‌ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన ఆశాస్త్రీయమన్నారు. 1994లో గుజరాత్‌లో కాంగ్రెస్‌ అధికారంలో ఉందని, రాష్ట్రంలో మోదీ కులాన్ని బీసీ జాబితాలో కలిపారని గుర్తు చేశారు. తర్వాత కొన్నేళ్లకు దేశంలో అమలు చేశారన్నారు. హిందువులను విడదీసే ఈ కుట్రలో పడొద్దని, యువకులు, బీజేపీ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో బీజేపీని అధికారంలోకి తెచ్చి హిందు రాష్ట్రం, హిందు దేశంగా మార్చడానికి కృషి చేయాలన్నారు. ఐక్యంగా ఉంటే మనల్ని ఎవరు ఏమీ చేయలేరన్నారు.

900 గ్రాముల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్టు



మాట్లాడుతున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఖలీల్‌వాడి: హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరి నుంచి 400 గ్రాములు, వారికి అమ్మిన మరో ఇద్దరి వ్యక్తుల నుంచి 500 గ్రాములు స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. వారిని అరెస్టు చేసి, వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. గురువారం సాయంత్రం నిర్మల్‌, ఆదిలాబాద్‌ నుంచి ఎండు గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి హైవే 44పై పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. టీవీఎస్‌ స్పోర్ట్స్‌ బైక్‌ టీజీ 18, 1151పై గంజాయిని తరలిస్తున్న జాదవ్‌ వంశీకృష్ణ, ఆకోజి అభిలాష్‌ పట్టుకుని 400 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా గంజాయి అమ్మిన తుకారాం రాథోడ్‌, తాళ్ల ప్రమోద్‌ను పట్టుకొని, వారి నుంచి 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నలుగురి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రతిభ చూపిన డిచ్‌పల్లి సీఐ మల్లేష్‌, ఎస్సై షరీఫ్‌, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించినట్లు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



దగ్ధమైన పెంకుటిల్లు

నిజాంసాగర్‌(జుక్కల్‌): మహమ్మద్‌నగర్‌ మండల కేంద్రంలోని ముద్రకోలు స్వరూపకు చెందిన పెంకుటిల్లు విద్యుత్‌ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం అయింది. శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి వారు బయటకు వెళ్లగా, కొద్దిసేపటికి ఇంట్లో నుంచి పొగలు రావడంతోపాటు మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి ఎల్లారెడ్డి అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. కానీ అప్పటికే ఇంట్లో ఉన్న రూ. 1.5లక్షల నగదుతోపాటు రెండున్నర తులాల బంగారు అభరణాలు, విలువైన బట్టలు, వంటసామగ్రి కాలిపోయాయి.

వర్క్‌ ఫ్రం హోం పేరిట సైబర్‌ మోసం

రెంజల్‌/నవీపేట: నవీపేట మండలకేంద్రంలో నివాసం ఉండే ఓ మహిళ వద్ద నుంచి వర్క్‌ఫ్రంహోం పేరిట సైబర్‌ మోసగాళ్లు సుమారు రూ.2లక్షలను కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా గనపవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి జ్యోతి రెండేళ్లుగా నవీపేట్‌ మండల కేంద్రంలోని ఓ అద్దె ఇంట్లో భర్తతో కలిసి నివసిస్తోంది. ఆర్థిక పరిస్థితి బాగోలేక ఆమె ఏదోఒక పని చేద్దామనుకుని ఆలోచించేది. ఈక్రమంలో ఇటీవల తన సెల్‌ఫోన్‌ ఇన్‌స్టాగ్రాంలో వర్క్‌ ఫ్రం హోం ప్రకటన చూసి, వారు పంపిన లింక్‌కు రూ. వెయ్యి పంపింది. అదేరోజు మహిళ అకౌంట్‌కు రూ. 1300 ప్రాఫిట్‌ వచ్చిందని పంపారు. అలాగే 2, 3 తేదీల్లో వారు సూచించిన విధంగా రూ. 2లక్షల 35వేల వరకు పంపారు. ఇంకా డబ్బులు పంపమని చెప్పడంతో అనుమానం వచ్చి మోసపోయినట్లు గ్రహించింది. వెంటనే సైబర్‌క్రైం నంబర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం నవీపేట్‌ పోలీస్‌ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

‘మెరుగైన వైద్యసేవలందించాలి’


నాగిరెడ్డిపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నేషనల్‌ హెల్త్‌ మిషన్‌(ఎన్‌హెచ్‌ఎం) జిల్లా ప్రోగ్రాం అధికారి పద్మజ సూచించారు. నాగిరెడ్డిపేట పీహెచ్‌సీని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్‌లెవల్‌ హెల్త్‌ ప్రొవైడర్‌)లతో ఆమె సమావేశమయ్యారు. గ్రామాల్లోని పల్లె దవాఖానాకు వచ్చే ప్రజలకు ఆయుష్మాన్‌ ఆరోగ్య మందిరం ద్వారా లభించే సేవల గురించి తెలియజేయాలన్నారు. ఇమ్యూనైజేషన్‌ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్‌



బాల్కొండ: ముప్కాల్‌ మండలం కొత్తపల్లి శివారులో శుక్రవారం ఒమ్ని వ్యాన్‌ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న ఎవరికీ కూడా గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ముప్కాల్‌ మండల కేంద్రం నుంచి ప్రయాణికులతో వస్తున్న ఒమ్ని వాహనం కొత్తపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి లక్ష్మికాలువ పక్కన గల చెట్టుకు ఢీకొంది. చెట్టు లేకుంటే నేరుగా వాహనం కాలువలో పడిపోయేదని, దీంతో పెద్ద ప్రమాదం సంభవించేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కామారెడ్డి క్రైం: పట్టణంలోని కాకతీయనగర్‌ కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా.. కాలనీలో నివాసం ఉండే జ్ఞానబాయి ప్రయివేటు టీచర్‌గా పని చేస్తున్నారు. గురువారం ఆమె ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి స్వగ్రామమైన గాంధారి మండలం కరక్వాడికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. దొంగలు పడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. ఇంట్లోని బీరువాలో దాచిన 10 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నారు.